www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 నవంబర్ 2024
5
చిత్తూరు

ఆక్రమణలు తొలగింపు

అనధికార కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రోడ్డుపై అనధికార ఆక్రమణలు తొలగింపు నగర పాలక సంస్థ పూనుకుంది. నగరపాలక సంస్థ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి నాగేంద్ర నేతృత్వంలో సిబ్బంది గిరింపేట, దుర్గమ్మ గుడి నుండి కొత్త కలెక్టరేట్ వరకు వేలూరు జాతీయ రహదారి కి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను జెసిబి ద్వారా తొలగించారు. రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని అనధికార దుకాణాలు, తోపుడు బండ్లు, తదితర వాటిని తొలగించినట్లు నాగేంద్ర తెలిపారు.

కలర్‌ఫుల్‌గా కలెక్టరేట్

- పచ్చదనం పరుచుకున్న పరిసరాలు
- ఆహ్లాదకరంగా ఆవరణం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం సరికొత్త రంగులతో కలర్‌ఫుల్‌గా కళకళలాడుతోంది. కలెక్టరేట్ చుట్టూ ఉన్న పరిసరాలు పచ్చదనంతో నిండి ఆవరణం అంతా ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్ కార్యాయలంలోని వివేకానంద భవన్, అంబేద్కర్ భవన్, పూలే భవనం చుట్టూ పచ్చనిగడ్డి మొక్కలు నాటారు. గత నెలరోజులుగా కలెక్టరేట్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ఆవరణంలోని ఎగుడు దిగుడలను జేసిబితో చదును చేశారు. మొక్కలు నాటేందుకు ఎర్రమట్టి తోలించి రకరకాల పూలమొక్కలతో ఆనందంగా తీర్చిదిద్దారు.

బ్రిటీష్ కాలంనాటి భవనాల్లోనే చిత్తూరు జిల్లా పరిపాలన భవనం (కలెక్టరేట్) జాయింట్ కలెక్టర్ వివిధ రకాల ప్రభుత్వ శాఖల భవనాలుండేవి. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కలెక్టరేట్ మార్పుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. చిత్తూరుకు అతి సమీపంలోని రెడ్డిగుంట వద్ద 10 ఎకరాలపైగా ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. వివేకానంద, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే పేర్లతో మూడు అంతస్తుల భవనాలు ఏర్పాటు చేశారు.

రంగులతో కలెక్టరేట్ ..

దాదాపు 17 ఏళ్ల తరువాత జిల్లా కలెక్టర్ కార్యాయలం కొత్తదనాన్ని సంతరించుకుంది. కలెక్టరేట్‌లోని మూడు భవనాలు కలర్‌ఫుల్‌గా కనిపించబోతున్నాయి. ఇప్పటికే వివేకానంద భవన్‌కు పెయింట్ పనులు జరిగాయి, ఈ భవనం పూర్తైయిన తరువాత అంబేద్కర్, పూలే భవనాలు రంగురంగులతో కలర్‌పుల్ కానున్నాయి.

కలెక్టరేట్‌కు కొత్త కళ..

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కలెక్టరేట్‌కు కొత్తకళ తీసుకొచ్చేలా ఆధునీకరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నిధులు మంజూరు చేశారు. భవనాలకు పెంటింగ్, గ్రీనరీ ఏర్పాటు వంటి పనులు శరవేగంగా జరుగుతున్నారు. అందవిహీనంగా ఉన్న జిల్లా పరిపాలన భవనం కొత్త కళను సంతరించుకుంటోంది. మొదటగా మరుగుదొడ్లను ఆధునీకరించారు. ప్రస్తుతం భవనాలకు రంగులు, పచ్చదనం కోసం మొక్కలు నాటుతున్నారు. మరో వారం, పది రోజుల్లో గ్రీనరీ పనులు పూర్తికానున్నాయి. రంగులద్దే పనులు పూర్తి చేస్తే జిల్లా పరిపాలన భవనం కళకళాడుతుంది.

వివేకానంద భవనం ముందు భాగంలో ఏర్పాటు చేసిన గ్రీనరి

పూలే భవనం ముందు

అంబేద్కర్ భవనం ముందు

రోడ్డు సరిలేక మధ్యలోనే ఆగిన లారీ

ఒకరి ద్విచక్రవాహనాలను మరొకరు నెడుతూ అవస్థలు పడుతున్న ప్రజలు

గుంతలు, బురదతో నిండి జాతీయ రహదారి

ఆదమరిస్తే అంతే..!


గుడిపాలలో రోడ్డు చివరలో ప్రమాదకరంగా ఉన్న గుంత

ప్రజాశక్తి -గుడిపాల: మండలంలోని ఓరియన్ ఫ్యాక్టరీ నుంచి హెచ్‌పి పెట్రోల్ బంక్ వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. దీంతో వాహనదారులు అందరు చెన్నై –బెంగళూరు జాతీయ రహదారిలో అనుపు సబ్‌స్టేషన్ వద్ద మలుపు తిప్పుతూ వేలూరుకు వెళుతుంటారు. అయితే ఆ దారిలో పెద్ద గుంత ఏర్పడింది. ఈ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో నిత్యం రద్దీగానే ఉంటుంది. గతంలో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. అయితే ఆ గుంతను ఇప్పటి వరకు పూడ్చలేదు. ఈ ప్రమాదకర గుంతను గమనించకుండా ఆదమరిచి ప్రయాణిస్తే పెను ప్రమాదాలు సంభవించే అవకాశం వుంది. గుంతను చూడకుండా వాహనాలు వెళ్లితే పక్కకు వాలి పడిపోయే ప్రమాదముంది. వేలూరు నుండి తిరుపతికి నిత్యం ఈ రోడ్డుపైనే అనేకమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణం

ప్రజలకు ప్రాణ సంకటం

- రోడ్డులో వాహనం అదుపు తప్పి కింద పడి వ్యక్తి మృతి
- ఐదేళ్లుగా మారని పరిస్థితి
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని దుస్థితి
- ఏళ్లతరబడి రోడ్డు మరమ్మతు కోసం నిరీక్షణ
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి- యాదమరి

చిత్తూరు – గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి మరమ్మతుల గురై ఐదేళ్లు పూర్తి అవుతోంది. అయినప్పటికీ ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. ఈ రోడ్డు మరమ్మతుల కోసం మండల ప్రజలు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదేళ్లపాటు నిరీక్షిస్తూనే ఉన్నారు. ఈ ఐదేళ్లలో ఈదారిలో ప్రయాణించి వారు ఎందరో ప్రమాదాల భారిన పడగా, మరికొందు కొందరు తీవ్రగ్రాయాలతో ఆసుపత్రులపాలయ్యారు. మరికొందరైతే ఏకంగా ప్రాణాలనే వదిలేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ రహదారి వాహనదారులకు శాపంగా మారింది.

గతంలో వామపక్ష పార్టీలు, అఖిలపక్షం నాయకులు, ప్రజాసంఘాలు, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వివిధ రూపాల్లో రోడ్లపై నిరసన వ్యక్తం చేశారు. మండల జిల్లాస్థాయి అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందించి వెంటనే రోడ్డు మరమ్మతు చేపట్టాలని జిల్లా అధికారులను కోరారు. అయినా ఫలితం శూన్యం. కొత్త ప్రభుత్వాలు వచ్చాయి. రోడ్డును వెంటనే మరమ్మతు చేపడతామని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులు రోడ్డును పరిశీలించారు. కాలం గడిచిపోయింది కానీ ఇప్పటివరకు మరమ్మతు చేపట్టడంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. అంతర్రాష్ట్ర గుంతల రోడ్లకు మంగళవారం కాశిరాల గ్రామంకు చెందిన మునిరత్నం గుంతలు రోడ్లలో వాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు.

చిత్తూరు– గుడియాత్తం అంతర్ రాష్ట్ర రహదారి జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్న యాదమరి మండలం జోడిచింతల పోలీస్ స్టేషన్ నుండి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు 10 కిలోమీటర్లు ఉంది. ఈ రోడ్డు పొడవునా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారయ్యింది. పది కిలోమీటర్ల మేర ఆరడుగుకో గుంత. వాహనచోదకులు దారి గుండా ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్న పరిస్థితి. ఇక ముందుకు సాగలేక.. వెనుక రాలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి చిత్తూరు– గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో చిన్నచిన్న గోతులు పెద్దవిగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి.

ద్విచక్రవాహనాల నుంచి పెద్దపెద్ద లారీలు సైతం ప్రతిరోజు ఈ గుంతల్లో చిక్కుకొని మొరాయిస్తున్నాయి. రోడ్లలోని గుంతల్లో వర్షపు నీరు నిండి బురదమయంగా ఉండడంతో వాహనదారులు ప్రమాదారుల భారిన పడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లో పరిస్థితి చెప్పనక్కర్లేదు. ప్రతిరోజు వాహనదారులు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం ఈ దారిలో ప్రమాదాలు జరుగుతున్నా ఇటు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో మండల ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఉద్యమబాట పట్టి నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నారు.

గతంలో పలుమార్లు రోడ్డు సమస్యపై పేపర్‌లో వచ్చిన కథనాలు

వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

యాదమరి– గుడియాత్తం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గతంలో సిపిఎం ఆందోళన చేయగా తూతూమంత్రంగా చిన్నచిన్న పనులు చేసి వదిలేశారు. చిన్నపాటి వర్షానికి చెరువులా మారిన రోడ్డులో ప్రజలు ప్రయాణించాలి అంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయపడుతున్న పరిస్థితి. మంగళవారం ఓ వ్యక్తి గుంతల్లో అదుపు తప్పి పడి మరణించడం బాధాకరం. నిత్యం ప్రమాదలు జరగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం ఇకనైనా స్పందించి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుంటే సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్షాలను కలుపుకొని దశలవారీ పోరాటాలకు సిద్ధమవుతాం. వందలాది మందితో రోడ్డు దిగ్బంధనం కార్యక్రమాలు చేపడతాం.

ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందిన మునిరత్నం

మృతుడు మునిరత్నం (ఫైల్‌ఫొటో)

గుంతల రోడ్డుకు టీడీపీ కార్యకర్త బలైన సంఘటన మండలంలోని జోడిచింతల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని కాసిరాళ్ళ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మునిరత్నం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై యాదమరికి వచ్చి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గుంతలోపడి ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలింది. చికిత్స నిమిత్తం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మునిరత్నం మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

సంక్షేమ హాస్టల్స్‌లోని సౌకర్యాలపై ఆరా

ఉరుస్తున్న భవనాలు, వంటగదుల పరిశీలన

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని సంక్షేమ హాస్టల్స్‌ను స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట స్థానిక గుడియాత్తం రోడ్డులోని బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడ అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్ భవనాలు పెచ్చులు ఉండడంతో పాటు వర్షాలు పడుతున్నపుడు పలు గదులు ఉరుస్తున్న విషయాన్ని హాస్టల్ వార్డెన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అన్ని గదులను పరిశీలించారు. అదేవిధంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు, పైప్ లైన్లతోపాటు వంటగదులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్లో అందుతున్న సౌకర్యాలు, మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సీ 1, ఎస్సీ 2 బాలుర వసతి గృహాలను సైతం ఆయన పరిశీలించారు. అక్కడి విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడానికి గల కారణాలను వార్డెలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు కల్పించాల్సిన పలు సౌకర్యాలపై ఆరా తీశారు. తదనంతరం లక్ష్మీ నగర్ కాలనీలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. హాస్టల్లో వార్డెన్ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థినులకు అందుతున్న అల్పాహారాన్ని పరిశీలించి సక్రమంగా మెనూ అందిస్తున్నారా లేదా అని విద్యారుల నుండి వివరాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని వసతి గృహాలను ఏర్పాటుచేసి దశాబ్దాలు గడుస్తుండడంతో కొన్ని భవనాలకు మరమ్మతులు గురయ్యాయని, ఎస్సీ బాలికల కొరకు నూతన వసతి భవనాన్ని నిర్మించనున్నామన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే నూతన భవన ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయించామని కాబట్టి త్వరలోనే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని హామి ఇచ్చారు. పిఆర్ ఏఈ విద్యాసాగర్, పలమనేరు సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్‌వి. బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, కృష్ణమూర్తి గౌడు, బిఆర్‌సి కుమార్, కోటి, నదీమ్, సుధాకర్, హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ పరపతి

సంఘాలను బలోపేతం చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గల 3,60,000 మంది రైతులలో 1.90లక్షల మంది మాత్రమే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో సభ్యత్వం కలిగి ఉన్నారని, రైతులు వారికి అవసరమైన ఎరువులు విత్తనాలు, సంబంధిత సామాగ్రికి సంబంధించి సంఘాల ద్వారా రుణాలు పొందుతున్నారని తెలిపారు. ఈ సంఘాల ద్వారా బహుళార్థక సేవలను అందించేందుకు కృషి చేయాలని, రైతులకు సంబంధించిన అంశాలతో పాటు ఇతరత్రా వ్యాపారాలు నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని నాబార్డు ద్వారా పొందే వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నాబార్డ్ నిధులతో నిర్మించిన గోడౌన్‌లను నిరుపయోగంగా కాకుండా వ్యవసాయ అనుబంధ శాఖలకు, ఐసిడిఎస్, హౌసింగ్ శాఖలకు అవసరమైన సామగ్రిని భద్రపరచుకునేందుకు వినియోగించుకునేలా సంబంధిత అధికారులతో చర్చించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ నాగవల్లి, నాబార్డు ఏజిఎం సునీల్, డిసిసిబి సీఈఓ మనోహర్ గౌడ్, వ్యవసాయ పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, డాక్టర్ ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

నేడు సర్వసభ్య సమా'ఆ'వేశం



ప్రజాశక్తి- వి కోట

మండల కేంద్రమైన వి కోటలో 6వ తేదీ బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో యువరాజ్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలు తమతమ పార్టీల విజయాలు, నాయకుల మెజారిటీ ఓట్లు పట్ల ధీమా వ్యక్తం చేస్తూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టడం, ఎమ్మెల్యేగా అమర్నాథరెడ్డి విజయం సాధించడంతో మండల తెలుగుదేశం పార్టీలోని కొంతమంది నేతలు, గత ప్రభుత్వంలో ఎంపీపీ యువరాజ్ చర్యలతో బాధపడ్డామని మండల సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా అడ్డుకున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్న తరుణంలో ఇప్పటివరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించలేకపోయారు అధికారులు.

ఇదివరకే రెండు పర్యాయాలు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేసినా అర్థాంతరంగా రద్దు అయ్యాయి. పంచాయతీరాజ్ చట్టం మేరకు సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించి సభ్యుల ఆమోదం మేరకు మండల పరిషత్ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. పక్కనున్న కుప్పం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో పార్టీలకు అతీతంగా సర్వసభ్య సమావేశాలు సజావుగా నిర్వహించి అభివృద్ధి పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి.

వి కోట మండలంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు ఆమోదం పొందకపోవడంతో మండలంలో ఉపాధి పనులు ఆగిపోయాయి. అదేవిధంగా ఇటీవల స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి మంజూరు చేసిన నూతన రోడ్లకు సంబంధించి మండల పరిషత్ పరిపాలన అనుమతులు ఉంటేనే గుత్తేదారులకు బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను 18 గ్రామపంచాయతీలో ప్రజలకు అవసరమైన పనులను చేపట్టేందుకు సభ్యుల ఆమోదం తప్పనిసరి కావడంతో నియోజకవర్గంలో వి కోట మండలం అభివృద్ధిలో కుంటుపడుతోందని, మండల పరిషత్‌కు అనుసంధానంగా నిర్వహించబడే పలు శాఖల పనులలో నిర్వేదం నెలకొందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల తీరుతో ప్రభుత్వ ఉద్యోగులు సంకట స్థితిని ఎదుర్కొంటున్నారు. నూతన ప్రభుత్వంలో ఉద్యోగుల బదిలీలు జరగడంతో మండలానికి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. బయట మండలాలతో వి కోట మండలాన్ని పోల్చుకుని మండలంలో చోటు చేసుకుంటున్న పరిస్థితుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు సమన్వయంతో విభేదాలు మరిచి బేషజాలకు పోకుండా గతంలో మండల పరిషత్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చిన నేతల అడుగుజాడల్లో నడిచే విధంగా వారి మార్గదర్శకంలో పయనించి మండలానికి పూర్వవైభవం తీసుకురావాలని నేడు జరిగే సర్వసభ్య సమావేశం సజావుగా కొనసాగాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజాసమస్యలపై 8 నుంచి ప్రజాపోరు

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రజాసమస్యలపై ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు చేపట్టనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం చిత్తూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజాసమస్యలపై ప్రజాపోరు పేరుతో గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేసి సమస్యలపై సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సిపిఎం జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే సమస్యలను గుర్తించామని జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, పేదల భూములకు రక్షణ కల్పించాలని, యానాదులు భూములు కబ్జా కాకుండా కాపాడాలని, బోయకొండ బాధితుల సమస్యలు పరిష్కరించాలని, నగిరి పవర్లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలకు సక్రమంగా వేతనాలు ఇచ్చి పనులు ఇవ్వాలని, రెవెన్యూ సర్వేలు అన్ని గ్రామాల్లో చేపట్టాలని, చిత్తూరు –గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఇవే కాకుండా రేపు సర్వే సందర్భంగా వచ్చిన సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకొస్తామని వాటిపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం 14వ తేదీన అన్ని తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ప్రజాపోరులో జిల్లాలోని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, షకీలా పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు
తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సూచించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు రూ.లక్షతో మొట్టమొదటి పార్టీ శాశ్వత సభ్యత్వ నమోదును చేసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్డును ఎమ్మెల్యే చేతుల మీదుగా గిరిబాబుకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపును తీసుకురావాలని కోరారు. ఆర్.బి.సి కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజాపీర్ నాగరాజు, మదన్, శ్రీధర్, మాబాషా, కిరణ్, చిన్నీ, సుధాకర్, సురేష్, సురేంద్ర, పర్వీన్ పాల్గొన్నారు.

గాజులపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి- తవణంపల్లి : మండలంలోని గాజులపల్లిలో బుధవారం మండల రెవెన్యూ అధికారి సుధాకర్, మండల సర్వేయర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీలోని భూసమస్యల పరిష్కారం కొరకు గ్రామసభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు ఎటువంటి భూ సమస్య ఉన్నా గ్రామసభలో తెలియజేయాలని, భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

టీబీపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- తవణంపల్లి : మండలంలోని ప్రధాన ఆరోగ్యకేంద్రంలో ఆశా దినోత్సవం సమావేశం బుధవారం జరిగింది. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శివకుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లోని ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు టీబీ పట్ల అవగాహన కల్పించాలని, బిసిజి వ్యాక్సిన్లు తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఎవరికైనా రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, గల్ల వంటి లక్షణాలుంటే వెంటనే గల్ల పరీక్ష చేసి టిబి అని నిర్ధారణ అయితే వారికి వెంటనే 6 నెలల పాటు వాడాల్సిన మందులు అందజేసి టిబి పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు.

యుటిఎఫ్ తవణంపల్లి

మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: యుటిఎఫ్ తవనణంపల్లి మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల గౌరవాధ్యక్షులుగా మునస్వామి, అధ్యక్షులు రాజేష్ కుమార్, సహాధ్యక్షులు శేఖరయ్య, మమత, ప్రధాన కార్యదర్శి పెదబ్బ రెడ్డి, కోశాధికారి చిరంజీవి, కార్యదర్శులుగా నిరంజన్ రెడ్డి, అరుణాచలం, గీత, ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకట రమణ, జిల్లా కౌన్సిలర్, రాజేష్ కుమార్, పెదబ్బ రెడ్డి, సురేష్ బాబు,శైలజ ఎన్నికయ్యారు.

పెండింగ్ వ్యాక్సినేషన్ పూర్తి చేయండి

డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ హనుమంతరావు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు
పుట్టిన బిడ్డ మొదలుకొని వృద్ధుల వరకు వ్యాక్సినేషన్ వేయడంలో పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆశా వర్కర్లను డిప్యూటీ డాక్టర్ హనుమంతరావు కోరారు. గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన ఆశా వర్కర్ల సమావేశంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుర్గాదేవి, పీహెచ్ఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్లు ధర్మేంద్ర, శైల ఎంఎల్ హెచ్ పీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

వివరాలను యాప్‌లో అప్లోడ్ చేయాలి

ప్రజాశక్తి- సోమల: సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పనిచేసే ఆశా కార్యకర్తలు ఈ ఆశ యాప్‌లో గర్భవతులు, బాలింతలు, రోగగ్రస్తుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి అప్లోడ్ చేయాలని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జయసింహ కోరారు. ఆశా డే సందర్భంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. న్యూమోనియాతో బాధపడే నవజాత శిశువు సంరక్షణపై దృష్టి సారించాలని, పెరుగుదల పర్యవేక్షణ చేయాలని, ఇండోర్, అవుట్డోర్ వాయు కాలుష్య నియంత్రణ కోసం వారికి సలహాలు సూచనలు అందించాలన్నారు. అలాగే ప్రారంభ రోగి నిర్ధారణ ఎప్పటికప్పుడు ఆసుపత్రికి రెఫర్ చేయాలని కోరారు. ప్రతి ఒక్క ఆశ కార్యకర్త తమ వద్ద 10 ప్రెగ్నెన్సీ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యాధికారి ప్రదీప్ కుమార్‌రెడ్డి, సిహెచ్ఓ అమర్నాథ్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు ఒక్కరోజు శిక్షణ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో 6వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఉద్యానవనశాఖ వారి ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని హార్టికల్చర్ అధికారిని సంతోషి కుమారి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పూత, పిందె దశలో మామిడి రైతులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి సలహాలు సూచనలు అందజేయడం జరుగుతుందని, శిక్షణ తరగతులలో భాగంగా శాస్త్రవేత్తలచే రైతుల అనుమానాలు సందేహాలు నివృత్తి చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

స.హ. చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని మఠం, ముల్లూరు కృష్ణాపురం గ్రామాలలో రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశానుసారం మండల వ్యవసాయ అధికారి జి.అప్పోజి ఆధ్వర్యంలో మంగళవారం సమాచార హక్కు చట్టం-2005పై ప్రజలకు, అధికారులకు, మఠం, ముల్లూరు కృష్ణాపురం రైతు సేవాకేంద్రాల సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు సమాచారాన్ని పొందవచ్చు అన్నారు. ఏ అధికారుల నుండి అయినా ఏ అధికార నియంత్రణ కింద ఉన్న ఏ సమాచారైన ఈ చట్టం కింద పొందగలిగే హక్కు ఉందని తెలిపారు. సమాచారం ఇవ్వకపోతే రాష్ట్ర సమాచార కమిషన్ పరిధిలో రోజుకు 250 చొప్పున గరిష్టంగా 25వేల రూపాయలు జరిమానా విధించబడుతుందని కూడా తెలిపారు.

నేడు మండలంలోని

15 పంచాయతీలలో గ్రామసభలు

ఉపాధి హామీ ఏపీవో దినకర్ బాబు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలోని 15 పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా పనుల గుర్తింపు కూలీలకు పనుల కేటాయింపు తదితర అంశాలపై ప్రత్యేక గ్రామసభలను జిల్లా స్థాయి అధికారులు నిర్వహించాలని తెలుపడంతో 6వ తేదీ బుధవారం ప్రత్యేక గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఏపీవో దినకర్ బాబు తెలిపారు. సోమల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినందున నూతన కరువు పనుల గుర్తింపు పాత పనులను పునరుద్ధరించడం కూలీలకు పనులు కల్పించడం తదితర అంశాలతో ప్రత్యేక గ్రామసభలను నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందని తెలపారు. ప్రజా ప్రతినిధులు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు అన్ని శాఖల అధికారులు గ్రామ సభలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడుకి ఘనస్వాగతం

బిఆర్.నాయుడుకి వరసిద్ధుడి ఆశీస్సులు

ప్రజాశక్తి- ఐరాల: టిటిడి నూతన ఛైర్మన్‌గా నియమితులైన తర్వాత మొదటిసారి తన స్వగ్రామం దిగువ పూనేపల్లె గ్రామానికి విచ్చేసిన బిఆర్.నాయుడుని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ వేదపండితులు వేదఆశీర్వాదం అందించగా పట్టువస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్, మాజీ ఆలయ ఛైర్మన్ మణినాయుడు, చిత్తూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, నాయకులు హేమాద్రి నాయుడు, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- సత్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురు ప్రసాద్

పూతలపట్టు: తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలక మండలి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు ఎమ్మెల్యే మురళీమోహన్, స్థానిక టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. పెనుమూరు మండలం పూనేపల్లె సొంత గ్రామానికి బిఆర్ నాయుడు వెళుతున్న సందర్భంగా మార్గమధ్యంలోని పూతలపట్టులో ప్రత్యేక స్వాగతం ఏర్పాట్లు చేశారు. కేరళ రాష్ట్రం నుంచి డ్రమ్స్, గుర్రపు బండిని తెప్పించి బండిపై జాతీయ రహదారిపై ఊరేగింపు చేయించారు. మండల కన్వీనర్ దొరబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెదురుకుప్పం: పెనుమూరు మండలం పూనేపల్లి గ్రామానికి విచ్చేసిన నూతన టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడుకి మండల నాయకులు ఘనంగా స్వాగతం పలుకారు. మంగళవారం వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి, టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బోడిరెడ్డి సుధాకర్ రెడ్డి, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

చిత్తూరు అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన బిఆర్ నాయుడుకి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆత్మీయ స్వాగతం పలికారు. మంగళవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న బిఆర్ నాయుడును ఎమ్మెల్యే గురజాల జగన్ కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం పెనుమూరు మండలంలోని బిఆర్ నాయుడు స్వగ్రామం దిగువ పూనేపల్లిలోని స్వగృహంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు సిఆర్ రాజన్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, జంగాలపల్లి శ్రీనివాసులు, థామస్, మురళీ మోహన్, బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం అల్లుకుంది..!

పట్టించుకునేది ఎవరు..?

ప్రజాశక్తి- వెదురుకుప్పం:

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రంలో కనిపిస్తున్న పచ్చని ట్రాన్స్ఫర్మర్. గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం జక్కదొన గ్రామం చెరువు పక్కనే జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌కు తీగలు అల్లుకున్నాయి. వర్షాల నేపథ్యంలో ఏదైనా ప్రమాదం సంభవించక ముందే తీగలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు అల్లుకొని ఉన్న తీగలను సైతం తొలగించాలని రైతులు కోరుతున్నారు.

'మామిడి'లో మెళకువలు పాటించాలి

జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- సదుం: మామిడి పంటలో మంచి దిగుబడులు రావాలంటే పూతదశ నుండి మెలకువలు పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం సదుం ఎంపీడీవో సమావేశపు మందిరంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి మామిడి పంట సాగుపై రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పూత నిలవడానికి అర్కా మ్యాంగో స్పెషల్ పోషకాన్ని లీటర్ నీటిలో 8 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. పూత మొదలవడానికి 13.0.45 8 గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. పురుగుల మందులు పిచికారి చేసేటప్పుడు మొక్క కాండం నుండి చిగురులు వరకు తడిచేలా పిచికారి చేయాలన్నారు. శాస్త్రవేత్త సోమశేఖర్, సదుం, సోమల, చౌడేపల్లి ఇన్చార్జి ఉద్యాన అధికారిణి సంతోషి కుమారి, సదుం మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, వీహెచ్ఏలు స్వర్ణలత, ప్రమీల, అగ్రిఅసిస్టెంట్ అఖిల్, సర్పంచులు హనుమంత రెడ్డి, మురళి రెడ్డి, మామిడి రైతులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను సహించేది లేదు

ఎక్సైజ్ డిఎస్పి విజయ శేఖర్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ఎక్సైజ్ డీఎస్పీ విజయ శేఖర్ కుప్పం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం దుకాణ యజమానులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మద్యం షాపుల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రారంభమైన మద్యం షాపులు ఇప్పటివరకు తాత్కాలిక అనుమతులపై జరుగుతోందని తెలిపారు. వీరికి త్వరలో ప్రభుత్వ నియమాలను అనుసరించి అనుమతి పత్రాలను త్వరలో అందజేస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రతి మద్యం దుకాణం వద్ద ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని సూచించారు. అలాగే బెల్టు షాపులకు అనుమతులు లేవని, ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినట్టు తమ దృష్టికి వస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం షాపుల యజమానులు సైతం బెల్టు షాపుల నిర్వహణకు సహకరించరాదని సూచిస్తూ, ప్రభుత్వ నియమాలను అతిక్రమించిన వారిని ఉపేక్షించేది లేదని, ప్రభుత్వా నియమాలను ఉల్లంఘించినట్టు గుర్తించిన ప్రజలు వెంటనే సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

అమానవీయ సంఘటనలపై

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది : ఎంపి

పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తోంది
ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో జరుగుతున్న అమానవీయ సంఘటనలపై ఏపీ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. చిత్తూరు పార్లమెంటులో తాజాగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై మంగళవారం ఎంపీ చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో రోజురోజుకూ హత్యలు, అత్యాచారాలు మితిమీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో పౌరసమాజం, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పోలీస్‌శాఖ సమర్థవంతంగా పనిచేస్తున్నా ఏదో మూల జరిగే నేరాలు, ఘోరాలు ఆంధ్రప్రదేశ్లో అలజడని సృష్టిస్తున్నాయని అన్నారు. ఈ సంఘటనల పై కలత చెందిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రభుత్వాన్ని గైడ్ చేశారని, వడమాల పేటలో జరిగిన హత్య, అత్యాచార ఘటనకు సంబంధించి, తిరుపతి అర్బన్ పోలీస్‌శాఖ వ్యవహరించిన తీరు అభినందనీయమని అన్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని ఎంపీ తెలియజేశారు. సమాజంలో అమానవీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించినప్పుడే సాన్విక లాంటి చిన్నారులు ఘెర అఘాయిత్యాలకు బలికారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఎంపి వెంట చిత్తూరు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు సునీల్, టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ తిరుమలయ్య తదితరులు ఉన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

సచివాలయ సిబ్బందిపై మండిపడ్డ జెడ్‌పి సీఈవో

ప్రజాశక్తి- విజయపురం : స్కూల్ విజిట్ చేయడంలో సచివాలయం సిబ్బంది వెనుకంజలో ఉన్నారని జెడ్పి సీఈవో రవికుమార్ మండిపడ్డారు. మండలంలో మొత్తం 45 పాఠశాల ఉండగా అందులో కేవలం 4 పాఠశాలలు మాత్రమే విజిట్ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మంగళవారం విజయపురం మండల కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విజయపురం మండల సచివాలయ సిబ్బంది పనితీరు దారుణంగా ఉందని, వెంటనే పని తీరు మార్చుకోవాలని, లేకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. స్కూల్లో మధ్యాహ్నం భోజనం, మరుగుదొడ్డి పరిశుభ్రపై రెండు రోజులకు ఒకసారి విజిట్ చేయాలని సూచించారు. అలాగే సమయపాలన పాటించాలని, ప్రజాసమస్యలపై తక్షణ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం లోపించకుండా తగుచర్యలు తీసుకోవాలని డీపీవో పార్వతి అన్నారు. అలాగే ఇంటి పన్ను విషయంలో అజాగ్రత్త వహించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెండు వారాలకు ఓ సారి ఓవర్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలన్నారు. మురికి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ఈవోపీఆర్డి రాజేంద్రన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లె ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గడిచిన ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురైన పల్లెలను తిరిగి అభివృద్ధి బాట పట్టిస్తామని, పల్లె ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. గడిచిన కొన్ని ఏళ్లుగా ఎలాంటి బస్సు సౌకర్యం లేని చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్ల కండిగ గ్రామానికి, బెంగుళూరుకు రెండు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను మంగళవారం సాయంత్రం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతన ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే చిత్తూరు నుంచి 38 ఆర్టీసీ బస్సులను ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలు, విద్యార్థులు, యువత చిత్తూరు పట్టణానికి రాకపోకలు సాగించడానికి వీలుగా ఈ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సిద్ధంపల్లి, పెరుమాళ్ల కండ్రిగ, హెచ్‌డబ్ల్యూ తదితర గ్రామాల ప్రజలకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ మార్గంలోని ప్రజల సైతం ఆర్టీసీ బస్సును ఆదరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ మేయర్ కఠారి హేమలత, సీనియర్ నాయకులు భీమనేని చిట్టిబాబు, 2వ డిపో మేనేజర్ రూపశ్రీ పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ కొత్త సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - రామకుప్పం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అని రామకుప్పం మండల వ్యవసాయ అధికారి అమృత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బగళనత్తం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాగి, వరి, మిరప తదితర పంటలను సాగుచేసే విధానం, పలు సూచనలు రైతులకు తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మునిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి ,లక్ష్మీనారాయణ రెడ్డి, రాఘవేంద్ర నాయుడు, బాలకృష్ణారెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో అధిక దిగుబడి

జిల్లా వనరుల కేంద్రం అధికారి పద్మజ

బంగారుపాళ్యం: జీవామృతంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం అధికారి పద్మజ తెలిపారు. మంగళవారం మండలంలోని కూర్మాయపల్లి, చిల్లగుండ్లపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నాటేటప్పుడు డ్రం సీడర్ ద్వారా వరి నాట్లు వేసుకోవాలని అందువలన నాటకం ఖర్చు తగ్గి పంట చూసేందుకు క్రమపద్ధతిగా ఉంటుందన్నారు. అలాగే తెగులు సోకినప్పుడు పంటలకు పిచికారి చేసేందుకు జీవామృతం కషాయంను తయారుచేసి పిచికారి చేయాలని దాని ద్వారా నాణ్యమైన పంట దిగుబడి అవుతుందన్నారు. సెరికల్చర్ ఏడి మోహన్ బాబు మాట్లాడుతూ మల్బరీ సాగులో మెలకువలు పాటించి పట్టుపురుగుల పెంపకం చేపట్టాలన్నారు. పట్టుపురుగుల పెంపకం షెడ్ నిర్మించుకునేందుకు ప్రభుత్వ రాయితీ ఇస్తుందని దీన్ని అవసరమైన రైతులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప, వ్యవసాయ విస్తరణ అధికారి సాదరయ్య, ఎస్ఓ వెంకట లక్ష్మమ్మ, టీవో గణేష్ గౌడ్, రాజేంద్ర నాయుడు, జ్ఞానశేఖర్, ఆర్‌బికె సిబ్బంది సాయిజ, ఎగువమూర్తి, అనిల్ పాల్గొన్నారు.

తవణంపల్లి : మండలంలోని దిగువమాగం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యాక్రమం జిల్లా జెడిఏ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను తెలియజేశారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఘణజీవామృతం, ద్రవజీవామృతం, ఆకులతో కషాయాలు, దేశీ ఆవు నుంచి వచ్చే పేడ, మూత్రం వినియోగించి తయారు చేసే సేంద్రియ ఎరువులు గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయం వలన తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని సూచించారు. ఏఓ ప్రవీణ్, ఏడిఏ ఉమ, ఎన్‌పిఎం సుధాకర్ నాయుడు, మండల యూనిట్ ఇన్‌ఛార్జి పి.సరిత, ఎస్‌డిఏ ప్రమీల, సిఆర్‌పిలు రాధ, అనురాధ, పల్లవి, ఐసిఆర్‌పి శ్రీధర్ నాయుడు, ఉప సర్పంచ్ గోపి, రైతులు పాల్గొన్నారు.

73 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్, డిఆర్‌డిఎ సంయుక్తంగా మంగళవారం స్థానిక చిత్తూరు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జిల్లా ఉపాధి అధికారి జి.పద్మజ, రీజినల్ ప్లేస్‌మెంట్ అధికారి సీడప్ పి.యుగంధర్ బాబు, ఐటిఐ ప్లేస్‌మెంట్ అధికారి మురళీకృష్ణ, ఏపిఎస్-ఎస్‌డిసి జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, సీడప్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్, ఏపిఎస్ఎస్‌డిసి ఎన్‌టిఓ పవన్ కుమార్, ఏపిఎస్ఎస్‌డిసి హెచ్ఆర్ అండ్ ఎంఐఎస్ వేణు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రూపేష్, సిసింద్రి పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో వివిధ బహుళజాతి కంపెనీలు పాల్గొన్నారు. అలాగే 149 హాజరుకాగా 73 మందికి ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

మరింత మెరుగ్గా పారిశుధ్యం

ఎంపీడీవో చంద్రమౌళి

ప్రజాశక్తి - కార్వేటినగరం: వారంలో మంగళ, శుక్రవారాలల్లో ప్రతి పంచాయతీలలో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో గ్రీన్ అంబాసిడర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మహిళా పోలీసుల ఆధ్వర్యంలో దాదాపుగా వంద మందితో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. జిల్లాలోనినే కార్వేటినగరం పారిశుద్ధ్యంలో మొదటి స్థానంలో ఉండాలని అందుకు తగ్గట్టుగా కార్యదర్శులు పనిచేయాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మండల అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అందించాలని, అప్పుడే పారిశుధ్యంలో ముందంజలో ఉంటామని ఎంపీడీవో పేర్కొన్నారు. గతంలో ఆరోగ్య కేంద్రంలో అడవిని తలపిస్తూ పాములు తిరుగుతూ ఉండేదని పిచ్చి మొక్కలను తొలగించడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, ఉద్యోగస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారుని, ఇదేవిధంగా మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలో కూడా పరిసరాలు శుభ్రంగా ఉండేలా సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేస్తూ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏవో విద్యావతి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఏకాంబరం, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

సీఎం సమక్షంలో టిడిపిలోకి ఎంపీటీసీలు

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో రామకుప్పం మండలంలోని పలువురు ఎంపీటీసీలు టిడిపిలో చేరారు. మంగళవారం మంగళగిరిలోని సీఎం నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్దనపల్లి సెగ్మెంట్ ఎంపిటిసి మంజునాథ్, విజలాపురంకు చెందిన వెంకటరామ గౌడు, రామకుప్పం సెగ్మెంట్ 1 చెందిన సిర్దోస్ భర్త తాజ్ మహల్ బాష, గోరివిమాకులపల్లికి చెందిన సుబ్బమ్మ కుమారుడు అశోక్, పంద్యాలమడుగు చెందిన జయమ్మ కుమారుడు నాగభూషణం నాయక్, సింగసముద్రం చెందిన అశ్విని భర్త ఆనంద్, ఉన్నిగానిపల్లికి చెందిన సులోచన భర్త గుర్రప్ప లకు చంద్రబాబు నాయుడు టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామ్మూర్తి, చలపతి నందారెడ్డి, సలాంసాబ్, మహమ్మద్ రఫీ, నాగభూషణం, రామలింగారెడ్డి, జయశంకర్, కృష్ణ నాయక్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

హెల్త్ కార్డులపై అవగాహన కల్పించండి

జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సుదర్శన్

ప్రజాశక్తి- యాదమరి: ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను క్షేత్రస్థాయిలో నమోదు చేయాలని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ ఆదేశించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశ కార్యకర్తల నెలవారీ సమావేశానికి డాక్టర్ సుదర్శన్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు వయసు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల గురించి వివరించి వారికి ఆ కార్డులను ఆన్లైన్లో అప్డేట్ చేయాలన్నారు. ఈ కార్డు కలిగిన పేదలకు 5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం, బీమా వర్తిసుందని తెలిపారు. వారం రోజులలోపు మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 70 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికి ఈ కార్డులు అందేలా వారి డేటాను ఆన్లైన్లో అప్డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యుత్ ఛార్జీల ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి'

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గోవిందరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం కుప్పం పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత గ్యాస్‌ను దీపావళి కానుకగా అందిస్తామన్న ఎన్‌డిఏ కూటమి విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఉచిత గ్యాస్‌కు 2,680 కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి సుమారు 6000 కోట్లు ప్రజలపై భారం మోపడం భావ్యం కాదన్నారు. ఒక దీపం పథకం అమలుకే 6000 కోట్లు ప్రజలపై భారం మోపితే సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రజలపై మరింత భారం మోపనుందో అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెనక్కి తీసుకుని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుప్పం మండల అధ్యక్షుడు పి.మునిస్వామి, కుప్పం మున్సిపాలిటీ అధ్యక్షులు నిజాం, ఎస్సీ సెల్ మునిసిపల్ ప్రెసిడెంట్ నాగరాజు, మునుకుట్టి, సుందర మూర్తి, వెంకటేష్, రంజిత్ కుమార్, సుబ్బు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-శాంతిపురం : గ్రామ అభివృద్ధిలో భాగంగా మంగళవారం రాళ్ళబూదుగూరులో నూతనంగా సిమెంటు రోడ్లు కొరకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ఎస్.మని మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి చేయడం, గ్రామాలకు మౌలిక వసతులు కల్పించడానికి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నామని తెలిపారు. సర్పంచ్ లక్ష్మి మురుగేష్, టిడిపి ప్రెసిడెంట్ జయరాజ్, బసవరాజు, కుమార్, రామప్ప, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సాధిక్, వీఆర్వో చెంగల్ రాయుడు పాల్గొన్నారు.